

# కన్నుల పండువగా

# ఉత్తర ద్వార దర్శనం



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్ ప్రతినిధి**

భద్రాచలంలోని శ్రీసీతారాములు ఆలయంలో శనివారం తెల్లవారు జామున వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం నేత్రపర్వంగా సాగింది. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన వేలాది మంది భక్తులు ఈ వేడుకను కనులారా వీక్షించారు. కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఉత్తర ద్వార దర్శనాన్ని చేసుకుని వేలాది మంది భక్తులు పులకించి పోయారు. జై శ్రీరామ్ నినాదాలతో భద్రాద్రి ఆలయం మార్మోగిపోయింది. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి ఉత్తరద్వార దర్శనం పండుగ అత్యంత వైభవం అన్నారు. కోటి పుణ్యాలకు సాటి ఒక ముక్కోటి ఏకాదశి గా పేర్కొంటారని చెప్పారు. మహా విష్ణువు దర్శనం తో మనలోని అజ్ఞానం తొలగి, శాశ్వతమైన శాంతి, జ్ఞానాన్ని కలుగజేస్తుందని అన్నారు. ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా భక్తి శ్రద్ధలతో దైవాన్ని పూజించి, భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. వైకుంఠం తలుపులు తెరుచుకునే వేళ ఈ పర్వ దినాన ఆ భగవంతుడు ముక్కోటి దేవతలతో భూలోకానికి వచ్చి, భక్తులకు దర్శనం ఇస్తారని, దర్శించుకుని, ముక్తిని పొందాలన్నారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా ఆ మహా దేవుడిని దర్శించుకుంటే మనల్ని వెంటాడుతున్న సమస్యలన్నింటికి పరిష్కారం లభించడంతో పాటు మోక్షం లభిస్తుందని తెలిపారు. పవిత్రమైన ఈ పండుగ పర్వదినాన అన్ని దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేయడం ఆనవాయితీ అన్నారు. భక్తులందరూ వైకుంఠ ద్వార దర్శనం లో పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వేదపండితులు ఆకాంక్షించారు.







